

సోమశిలలో 63.330 టీఎంసీలు
జలాశయంలో మంగళవారానికి 63.330 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 19,745 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. డెల్టాకు 1350, ఉత్తరకాలువకు 400, కండలేరుకు 10,100 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,07,610
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.9,687
3 శాతం జీఎస్టీతో	రూ.9,978
నవర (8 గ్రా)	రూ.79,824

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
35.3 /27.4
జిల్లాలో బుధవారం అక్కడక్కడ చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. మంగళవారం గాలిలో తేమ 59 శాతంగా నమోదైంది.

ఆపన్నులకు ఆదరణై.. అమరుడై..

చిరస్మరణీయుడు వైఎస్సార్



నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తూ..



పార్టీ జిల్లా కార్యాలయంలో విగ్రహానికి కాకాణి, జంకె, పర్వతరెడ్డి, ఆనం తదితరుల నివాళి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తరతరాలకు గుర్తుండిపోయే చిరస్మరణీయ ప్రజానాయకుడు, పరిపాలనా దక్షుడు అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ 16వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్‌లో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి సాధించారన్నారు. ఆయన పరిపాలనలో చెరగని ముద్ర వేశారన్నారు. నెల్లూరు, సంగం బ్యారేజీల నిర్మాణం, కృష్ణపట్నం పోర్ట్ ఏర్పాటు ఆయన కృషి వల్లే సాధ్యమయ్యాయన్నారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం కార్యక్రమాలతోపాటు పారిశ్రామికంగా అనేక సెజ్‌లు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుంచారని తెలిపారు. రాజశేఖరరెడ్డి వారసుడిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ తండ్రికి తగ్గ తనయుడిలా ఐదేళ్లలో సంక్షేమ పాలనను ప్రజలకు అందించారని తెలిపారు.

దేశానికే రోల్‌మోడల్ వైఎస్

ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి తన పరిపాలనతోపాటు 108 అంబులెన్స్‌లు, 104 మొబల్ ఆరోగ్య సేవ వాహనాలు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి వినూత్న సేవలు తీసుకువచ్చి దేశంలోనే రోల్‌మోడల్ నేతగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి రంగాల్లో వైఎస్సార్ విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలికారని తెలిపారు. విద్య విషయానికొస్తే, బీసీ, ఈ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అన్ని కులాల వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేసి విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు తోడ్పాటు అందించారని తెలిపారు. ఈ రోజు ఆయన తీసుకొచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు అమలు చేసే దిశలో ఉన్నాయన్నారు. రాజశేఖరరెడ్డి తీసుకువచ్చిన ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రతి పేదవాడు కార్పొరేట్ హాస్పిటల్‌లో ఉచిత చికిత్సలు పొందుతున్నాడని, 108 సేవలను తీసుకువచ్చి ప్రమాద సమయంలో గాయపడ్డ వారికి తక్షణ వైద్య సహాయం అందించడం, 104 ద్వారా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించిన ఘనత రాజశేఖర్ రెడ్డిదని కొనియాడారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజితమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో రక్తదానం నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు



పేదలకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి

న్యూస్‌రీల్

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు



మాట్లాడుతున్న డీఈఓ బాలాజీరావు

నెల్లూరు (టౌన్): చెవి, కంటి, మానసిక, శారీరక వైకల్యం ఉన్న దివ్యాంగ విద్యార్థులకు త్వరలో ఉపకరణాలను అందజేయనున్నట్లు డీఈఓ బాలాజీరావు తెలిపారు. మంగళవారం రంగనాయకులపేటలోని పీఎంఆర్ మున్సిపల్ స్కూల్‌లో నిర్వహించిన మెడికల్ క్యాంపులో 135 మంది దివ్యాంగ విద్యార్థులకు వివిధ విభాగాల వైద్యులు పరీక్షలు నిర్వహించారు. సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, ఎంఈఓ తిరుపాల్, సమగ్ర శిక్ష సీఎంఓ పెంచలయ్య, హెచ్‌ఎం హైమావతి తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్, వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ

నెల్లూరు (టౌన్): దీన్‌దయాళ్ ఉపాధ్యాయ-గ్రామీణ కౌసల్య యోజన పథకంలో భాగంగా సీడాప్, త్రెడ్జ్ ఐటీ ప్రైవేట్ లిమిటెడ్ కంప్యూటర్, వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ యజమాని కె.సునీల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ సమయంలో వసతి, భోజనం, యూనిఫాం అందజేస్తామని చెప్పారు. శిక్షణ అనంతరం ఇండస్ట్రీయల్ సర్టిఫికెట్‌తోపాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న యువతీ, యువకులు విద్యార్హత సర్టిఫికెట్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జెరాక్స్‌లను త్రెడ్జ్ ఐటీ ప్రైవేట్ లిమిటెడ్, కేఎస్‌ఎన్ ఇంజినీరింగ్ కాలేజీ, కొత్తూరురోడ్డు, కోవూరు అడ్రసులో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 98661 11223 నంబరులో సంప్రదించాలన్నారు.

వెంకటాచలం సర్పంచ్‌కు షోకాజు నోటీసు

వెంకటాచలం: వెంకటాచలం సర్పంచ్ మందల రాజేశ్వరి చెక్ పవర్ ఎందుకు రద్దు చేయకూడదో వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని డీపీఓ శ్రీధర్ రెడ్డి మంగళవారం షోకాజు నోటీసు ఇచ్చారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం జరిగాయని టీడీపీ నేతలు ఫిర్యాదు చేయడంతో డీఎల్పీఓతో విచారణ చేపట్టగా, నిధులు దుర్వినియోగానికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. అయితే మళ్లీ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి కావలి డీఎల్పీఓతో ఇటీవల విచారణ జరిపారు. ఈ క్రమంలో సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయకూడదో వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని సర్పంచ్ రాజేశ్వరి షోకాజు నోటీసు ఇచ్చారు. రాజేశ్వరి మాట్లాడుతూ రాజకీయ కక్షతోనే బీసీ మహిళా సర్పంచ్‌నైన తన చెక్‌పవర్ రద్దు చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

రైళ్ల పరుగుకు అంతరాయం

బిట్రగుంట: కాకినాడ పోర్ట్ నుంచి చెన్నై వెళ్తున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో బ్రేక్ బైండిగ్ కారణంగా కొదిసేపు నిలిచిపోవడంతో రైళ్ల రాకపోకలకు స్వల్ప అంతరాయం ఏర్పడింది. రైలు కావలిస్టేషన్ దాటిన తర్వాత ఎస్వీపాళెం స్టేషన్ సమీపంలోకి వచ్చేసరికి బ్రేక్ బైండింగ్ సమస్య తలెత్తింది. దీంతో రైలును పరిమిత వేగంతో బిట్రగుంట స్టేషన్‌కు చేరుకుంది. అప్పటికే సిద్ధంగా ఉన్న సిబ్బంది హుటాహుటిన మరమ్మతులు పూర్తి చేసి రైలు పరుగుకు పచ్చజెండా ఊపారు.

ఈ కుర్చీ నాదే.. ఈ ఆఫీస్ నాదే

కోవూరు ఎస్‌ఆర్‌ఓ సీనియర్ అసిస్టెంట్ దౌర్జన్యం
- రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్‌ను జాయిన్ కాకుండా నడిపిన హైడ్రామా
- తాజాగా ఆయన్ను ట్రాన్స్‌ఫర్ చేయాలంటూ డీఐజీ వద్ద పైరవీలు
- అవినీతి మరిగి అక్రమ రిజిస్ట్రేషన్లతో న్యాయపరమైన చిక్కులు సృష్టి

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఆయనది సీనియర్ అసిస్టెంట్ హోదా. కానీ అడ్డదారిలోనైనా సబ్ రిజిస్ట్రార్ సీటులో కూర్చోవాలనే దుగ్ధ. జిల్లాలో ఏ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసినా అవినీతి ఆరోపణలు, వివాదాస్పదంగా వ్యవహరిస్తూ ఆయా సబ్ రిజిస్ట్రార్ల సీటుకు ఎసరు పెట్టడంలో ఆయనకు ఆయనే సాటి. నెల్లూరు నగర ఎస్‌ఆర్‌ఓలో పనిచేస్తున్న సమయంలో అక్రమాలకు పాల్పడడంతో అప్పటి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ కిరణ్ సస్పెండ్ చేశారు. ఆ తర్వాత కోవూరు ఎస్‌ఆర్‌ఓలో మూడేళ్ల క్రితం సీనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరిన ఆయన ఇక్కడా అదే తీరుగా వ్యవహరించి సబ్ రిజిస్ట్రార్‌ను బదిలీ చేయించడంలో వేసిన పాచికలు పారాయి. అప్పటి నుంచి ఆయనే ఇక్కడ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇక్కడ కూడా అక్రమ రిజిస్ట్రేషన్లతో యజమానులకు న్యాయపరమైన చిక్కులు సృష్టించడంతో కోర్టులో కేసులు నడుస్తున్నాయి.

కోవూరు : కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సూపర్ బాస్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇక్కడకు వచ్చిన ఎస్‌ఆర్‌ఓలకు పొగబెట్టి తరిమేసి.. ఆయనే ఇన్‌చార్జి ఎస్‌ఆర్‌ఓగా ఉండేలా చక్రం తిప్పడంలో అపర ప్రావీణ్యం చూపిస్తున్నారు. ఇతని పోకడలు, వ్యవహారిక తీరుతో కష్టాల్లో పడిన సబ్ రిజిస్ట్రార్లకు కంటగింపుగా మారాయి. ఆయన కంటే పైస్థాయి అధికారి అయిన సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించాలన్నా.. విధులు నిర్వర్తించాలన్నా.. ఈ సీనియర్ అసిస్టెంట్ అనుమతి ఉండాలంట. తాజాగా ఉద్యోగోన్నతిపై కోవూరు సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీపై శనివారం వచ్చిన పులి పెంచలయ్యను విధుల్లో జాయిన్ కావడానికి వీల్లేదంటూ దాదాపు మూడు గంటలపాటు హైడ్రామా నడిపించాడు. సబ్‌రిజిస్ట్రార్లు అందరూ ఏకమై సదరు శాఖ మంత్రికి ఫిర్యాదు చేయడంతో ఆగమేఘాల మీద స్పందించిన స్థానిక ఎమ్మెల్యే, ఎంపీతోపాటు ఆ శాఖ డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ మందలింపుతో ఎట్టకేలకు సబ్ రిజిస్ట్రార్‌గా పులి పెంచలయ్య బాధ్యతలు స్వీకరించారు.

డీఐజీ వద్ద పైరవీల ప్రయత్నాలు

కోవూరు సబ్ రిజిస్ట్రార్‌గా పులి పెంచలయ్య బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రగిలిపోతున్న సదరు సీనియర్ అసిస్టెంట్ మరుసటి రోజు నుంచే పైరవీలు, కుట్రలకు తెర తీశారు. సోమవారం కార్యాలయానికి అధికారికంగా సెలవు పెట్టకుండా, ఫోన్‌లో బయటకు వెళ్తున్నట్లు కార్యాలయ సిబ్బందికి చెప్పినట్లు తెలుస్తోంది. నేరుగా డీఐజీ కార్యాలయానికి వెళ్లి కొత్తగా జాయిన్ అయిన పులి పెంచలయ్యను ఇక్కడి నుంచి బదిలీ చేయించి తననే ఇన్‌చార్జి ఎస్‌ఆర్‌ఓగా కొనసాగించాలంటూ పైరవీలు చేసినట్లు సమాచారం. ఆ పోస్టు తనకు ఇస్తే ఎంత కావాలంటే అంత మొత్తం సమర్పించుకుంటానంటూ ఏకంగా తనపై అధికారి వద్దనే బేరం పెట్టడం చూస్తే పరిస్థితి అర్థమవుతోంది.

అంతేకాకుండా ఈ కుర్చీ నాదే.. ఈ ఆఫీస్ నాదే.. అక్కడ కొత్త ఎస్‌ఆర్‌ఓ కూర్చొవడానికి వీల్లేదంటూ హెచ్చరించినట్లు సమాచారం. మూడేళ్లుగా కోవూరుకు రెగ్యులర్ ఎస్‌ఆర్‌ఓను రానివ్వకుండా అడ్డుకుంటూ వచ్చి ఆయనే యాక్టింగ్ ఎస్‌ఆర్‌ఓగా విధులు నిర్వహిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇన్‌చార్జి ఎస్‌ఆర్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న




మోహనమ్మ తన కుమార్తె పేరిట చేసిన రిజిస్ట్రేషన్



సీనియర్ అసిస్టెంట్ అవినీతి, అక్రమాలకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కొనుగోలుదారులే కాకుండా, చివరకు కింది సిబ్బంది నుంచి స్టాంప్ రైటర్లు కూడా విలవిలాడుతున్నారు.

ఇన్‌చార్జి ఎస్‌ఆర్‌ఓ అక్రమాలు మచ్చుకు..

- కొడవలూరు మండలం గండవరం గ్రామానికి చెందిన బాబావలీ అనే మహిళ అదే గండవరం పంచాయతీలో 2015లో మోహనమ్మ అనే మహిళ నుంచి ఇంటిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకుంది. భర్త ఉద్యోగం చేస్తున్న నేపథ్యంలో పాదలకూరులో ఉంటున్నారు. అయితే ఆమె కొనుగోలు చేసిన ఇంటిని విక్రయించిన మోహనమ్మ తానే అద్దెకు ఉంటామని కోరితే ఇచ్చింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఇంటి పన్ను చెల్లిస్తున్నారు. అయితే ఈ ఏడాది ఇంటి పన్ను చెల్లించేదానికి వెళ్తే ఆ ఇల్లు బాబావలీ పేరుతో లేదని పంచాయతీ అధికారి బ్రహ్మారెడ్డి తెలిపారు. తీరా విచారణ చేస్తే ఆమెకు ఇంటిని విక్రయించిన మోహనమ్మ.. ఆమె కుమార్తె వరలక్ష్మి పేరుతో గతేడాది డాక్యుమెంట్ నంబరు 65/2024 గా రిజిస్ట్రేషన్ చేసినట్లు గుర్తించింది. ఈ ఇంటికి సంబంధించి రిజిస్ట్రేషన్, ఈసీ నకలు బాబావలీ పేరుతోనే ఉన్నా.. కోవూరు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించిన సీనియర్ అసిస్టెంట్ సదరు మోహనమ్మ వద్ద భారీగా ముడుపులు తీసుకుని ఆమె కుమార్తె పేరుతో రిజిస్ట్రేషన్ చేసినట్లు, పంచాయతీ సెక్రటరీ బ్రహ్మారెడ్డి కూడా మోహనమ్మ కుమార్తె పేరుతో కొత్తగా పన్ను వేయడంతో వీరిద్దరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గత వారంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయసింది.
- విడవలూరుకు చెందిన ఏనేటి తులసమ్మకు 1.25 ఎకరాల భూమి ఉంది. ఆ భూమికి సంబంధించి ఆమె తర్వాత మరికొందరు వారసులు ఉన్నారు. అయితే ఆమెను మనమడు ఏనేటి ఉరఫ్ వేనేటి సురేష్ సదరు ఇన్‌చార్జి ఎస్‌ఆర్‌ఓతో కుమ్మక్కై ఆమెను ఏమార్చి పింఛన్ కోసం సంతకాలు పెట్టాలంటూ తీసుకువచ్చి ఇటీవల డాక్యుమెంట్ నంబరు 850/2025 కింద తన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. నా ఆస్తి నా బిడ్డలందరికీ సమానంగా రావాలి. కానీ నాకు తెలియకుండా ఈ భూమికి సంబంధించి పట్టాలు, డాక్యుమెంట్లు అన్ని మా దగ్గరే ఉన్నా.. అవి లేకుండానే సబ్ రిజిస్ట్రార్ ఎలా ఒక్కడి పేరుతో రిజిస్ట్రేషన్ చేస్తారంటూ సోమవారం ఏనేటి తులసమ్మ, ఆమె మిగతా కుటుంబ సభ్యులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని అధికారులను నిలదీశారు.
- కోవూరు ఎస్‌ఆర్‌ఓలో జరుగుతున్న వివాదాలు, అక్రమ రిజిస్ట్రేషన్ల విషయమై సాక్షి మంగళవారం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ మునిశంకర్‌ను వివరణ కోరగా అన్ని విషయాలు నా దృష్టికి వచ్చాయన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ జరిపి, బాధ్యుడైన అధికారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వివాదాలకు చెక్ పెట్టేందుకు కఠినంగా వ్యవహరిస్తామన్నారు.



ఏనేటి తులసమ్మతో చేయించిన రిజిస్ట్రేషన్

తండ్రి మరణానంతరం ఉద్యోగం

కోవూరు ఎస్‌ఆర్‌ఓలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తి తండ్రి గూడూరులోని ఎస్‌ఆర్కే కాలేజీలో తెలుగు లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తూ 2004లో రైలు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో కారుణ్య నియామకంలో భాగంగా విద్యాశాఖలో ఉద్యోగమిస్తే.. అప్పట్లోనే పైరవీలు చేసి భారీ మొత్తంలో లంచం ఇచ్చి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో చేరినట్లు అతని సమీప సన్నిహితులు చెబుతున్నారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి అవినీతి, అక్రమార్జనతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోవూరులో ఇన్‌చార్జి ఎస్‌ఆర్‌ఓగా చేరాక ఓ డాకుమెంట్ రైటర్‌ను తన గుప్పెట్లో పెట్టుకుని అక్రమ స్థలాలకు అధిక మొత్తంలో డబ్బులు తీసుకొని రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు సమాచారం.

భాగస్వామ్య పార్టీ నేతకే ద్రోహమా..?

- బీజేపీ మహిళా నేత రాజేశ్వరమ్మకు బలిజ సంఘాల మద్దతు
- వంద టేకుచెట్లు అక్రమంగా నరికివేత
- రూ.లక్షలు విలువైన కలపను అమ్ముకున్న వైనం
- ఎమ్మెల్యే సోమిరెడ్డి వద్ద తెగని పంచాయితీ
- పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువు
- నేడు మరుపూరు తోట సందర్శనకు రాక



బలిజ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు : కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీ అయిన బీజేపీ మహిళా నేత, ప్రముఖ వైద్యుడు అంజనీకుమార్ సతీమణి రాజేశ్వరమ్మకు జరిగిన అన్యాయంపై అనేక సంఘాలు ఇప్పటికే మద్దతు పలికాయి. జిల్లా బలిజ సంఘాలు సైతం మంగళవారం నెల్లూరులో సమావేశమై రాజేశ్వరమ్మకు బాసటగా నిలిచాయి. అవసరమైతే చలో అమరావతి సైతం చేపడతామని ప్రకటించారు. పొదలకూరు మండలం మరుపూరులో కే రాజేశ్వరికు చెందిన సొంత భూమిలో టేకు చెట్లను టీడీపీ నేతలు అక్రమంగా నరికి దుంగలను తరలించిన రూ.లక్షలు సొమ్ము చేసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. టీడీపీ నాయకుల నిర్వాకంపై రాజేశ్వరమ్మ ఎమ్మెల్యే సోమిరెడ్డి వద్ద పంచాయితీ పెట్టినా ఎలాంటి ఉపయోగం లేకపోయింది. దీంతో ఆమె గత నెల 26న పొదలకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేకపోవడంతో బలిజ సంఘాల నాయకులు రంగంలోకి దిగారు.

వంద టేకు చెట్ల నరికివేత

పొదలకూరు మండలం మరుపూరులో 637-3, 637-4, 639-1, 639-2, 640-1, 640-2 సర్వే నంబర్లలో రాజేశ్వరమ్మకు 20.98 ఎకరాల భూమి ఉంది. ఈ పొలంలో ఉన్న వంద టేకు చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసినట్లు ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే రూ.లక్షలు విలువైన టేకు చెట్లను టీడీపీ నేతలు కొట్టేసినట్లు గుర్తించారు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేకపోవడంతో ఆమె అభిమానులు, సామాజిక వర్గానికి చెందిన వారు, బీజేపీ, జనసేన కార్యకర్తలు స్పందించి సామాజిక మాధ్యమాల్లో పోస్టింగులు పెడుతూనే ఉన్నారు.

నేడు మరుపూరుకు..

జిల్లా బలిజ సంఘాల నాయకులు కత్తిర మల్లిసిరి శ్రీనివాసులు, నాగిశెట్టి మురళీ బృందం మరుపూరు సమీపంలో రాజేశ్వరమ్మకు చెందిన తోటలో టేకు చెట్లను నరిన ప్రాంతాన్ని పరిశీలించనున్నట్లు తెలిపారు. తమ ఆడపడుచుకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని ఎంత దూరమైన వెళ్లి పోరాటం చేస్తామని ప్రకటించారు. అటవీశాఖ అనుమతి లేకుండా టేకు చెట్లను ఎలా నరుకుతారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీలో కొనసాగుతున్న రాజేశ్వరమ్మ పొదలకూరు పోలీస్‌స్టేషన్లో రాత పూర్వకంగా గత నెలలో ఫిర్యాదు చేస్తే ఇప్పటి వరకు కేసు నమోదు చేయకపోవడం దుర్మార్గమన్నారు. స్థలం పత్రాలను పోలీసులు అడుగుతున్నట్లు పేర్కొన్నారు.

అవినీతిలో నెల్లూరు కార్పొరేషన్ నంబర్ వన్

- ఆనం వెంకటరమణారెడ్డి



నెల్లూరు (బారకాసు): సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం ప్రత్యేకాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఐఏఎస్ అధికారి వికాస్‌మర్మత్‌ను టార్గెట్ చేస్తూ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఏపీ ఆక్వా అథారిటీ బోర్డు చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి ఆరోపణలు గుప్పించారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోరంటూ మంగళవారం ప్రస్తుత కమిషనర్‌తో మాట్లాడిన అనంతరం విమర్శలు చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని పలు భవంతులు, అపార్ట్‌మెంట్ల మార్ట్ గేజ్ ప్రక్రియలో భారీ అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని వెంకటరమణారెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలోని కార్పొరేషన్లలో అవినీతిలో నెల్లూరు కార్పొరేషన్ నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు.

అవినీతిపై విచారణకు హైకోర్టు ఆదేశాలు

కార్పొరేషన్‌లో జరిగిన అవినీతిపై తాను హైకోర్టును ఆశ్రయించడంతో పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కలెక్టర్ ఆనంద్‌ను ఆదేశించిందన్నారు. నెల్లూరు నగరంలో 74 భవంతులకు సంబంధించి ఆక్యూపెన్సీ సర్టిఫికెట్లు ఇతర ధ్రువ పత్రాలు లేకున్నా వాటిని రిలీజ్ చేశారన్నారు. గతంలో కమిషనర్లుగా పనిచేసిన ఐఏఎస్ అధికారులు హరిత, వికాస్‌మర్మత్‌తోపాటు చెన్నుడు హయాంలోనే ఈ అక్రమాలు జరిగాయని ప్రస్తుతం ఉన్న ఉన్నతాధికారులే చెబుతుంటే మరలా ఈ వ్యవహారంపై విజిలెన్స్ విచారణకు ఎందుకు ఆదేశించారో తనకు అర్థంకావడం లేదన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు జరగకుండానే గత కమిషనర్‌గా ఉన్న హరిత బిల్లులు చేశారని ఆరోపించారు. అవినీతికి పాల్పడిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే న్యాయం కోసం మళ్లీ హైకోర్టును ఆశ్రయించేందుకు వెనుకాడబోనని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

లారీ ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో ఈశ్వరయ్య మృతదేహం

కొడవలూరు: లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని గండవరం సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. దగదర్తి మండలం ఊచగుంటపాళేనికి చెందిన ఆలూరు ఈశ్వరయ్య ఆచారి (63) వృత్తి రీత్యా వడ్రంగి పని చేస్తుంటాడు. వృత్తిలో భాగంగా కొయ్యలు కోయించుకునేందుకు నార్తురాజుపాళెంలోని రంపకోత మిల్లుకు బైక్‌పై మంగళవారం సాయంత్రం వచ్చాడు. మిల్లులో పని అయ్యాక తిరిగి స్వగ్రామానికి రాత్రి బయలుదేరాడు. హైవేపై గండవరం సబ్‌స్టేషన్ వద్ద వెళ్తున్నాడు. ఈ సమయంలో బెంగళూరు నుంచి సోలార్ ప్యానళ్ల లోడుతో గుంటూరుకు వెళ్తున్న లారీ వెనుక నుంచి వేగంగా బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఈశ్వరయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై కోటిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి :	రూ.45
సన్నవి :	రూ.30
పండ్లు :	రూ.15

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.118
లేయర్	రూ.123
బ్రాయిలర్ చికెన్:	రూ.216
స్కిన్‌లెస్ చికెన్:	రూ.240
లేయర్ చికెన్:	రూ.210

మైనింగ్.. మళ్లీ మొదలు

కాలం చెల్లిన గనుల్లో ముఖ్యనేత పనులు

- బ్లాస్టింగ్ చేపట్టిన వైనం
- పట్టించుకోని యంత్రాంగం

సాక్షి టాస్క్‌ఫోర్స్: మండలంలోని సైదాపురం, చాగణం రాజుపాళెం సమీపంలో ఎలాంటి అనుమతుల్లేకుండా ఓ ముఖ్యనేత కనుసన్నల్లో అక్రమ మైనింగ్ మళ్లీ మొదలైంది. కొంతకాలం క్రితం స్థానిక ప్రజాప్రతినిధికి ఆ నేతకు మధ్య చెలరేగిన వివాదం కారణంగా మైన్స్‌పై పోలీసులు, రెవెన్యూ అధికారులు మూకుమ్మడిగా దాడులు చేసి పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో కూటమి నేతల మధ్య ఏం జరిగిందో కానీ శ్రీనివాసా పద్మావతి (శోభారాణి), సిద్ధి వినాయక గనుల్లో మళ్లీ అక్రమ మైనింగ్ మొదలైంది. మంగళవారం అనధికారికంగా వాటిల్లో అక్రమంగా బ్లాస్టింగ్ చేసినట్లు తెలిసింది.

కూటమి నేతలే..

నెల్లూరు జిల్లాలోని సైదాపురం, పొదలకూరు, చేజర్ల, ఉదయగిరి మండలంతోపాటు తిరుపతి జిల్లాలోని గూడూరు ప్రాంతాల్లో దొరికే క్వార్ట్జ్, ఫల్స్‌పర్, వర్‌ముఖ్‌లైట్ ఖనిజానికి స్వదేశంతోపాటు విదేశాల్లో కూడా ప్రస్తుతం గిరాకీ ఉంది. ప్రధానంగా సైదాపురం మండలంలో దొరికే మైకా క్వార్ట్జ్‌కు విపరీతమైన డిమాండ్ ఉంది. దీంతో కూటమికి చెందిన నేతలు కొత్తగా వ్యాపారాలు చేసేందుకు రంగప్రవేశం చేస్తున్నారు.



సిద్ధి వినాయక మైన్‌లో జరుగుతున్న పనులు

అనుమతుల్లేని గనుల్లో..

మండలంలోని చాగణం రాజుపాళెం, సైదాపురం సమీపంలో కాలం చెల్లిన శ్రీనివాసా పద్మావతి (శోభారాణి), సిద్ధి వినాయక గనులున్నాయి. గతంలో లీజు తీరిపోవడంతో వాటిని అలాగే వదిలేశారు. ఈ గనిలో మైకా క్వార్ట్జ్ ఖనిజం ఉంది. దీనికి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని కూటమి నేతలు వాలిపోయారు. నిబంధనలకు విరుద్ధంగా జీఓలు తెచ్చుకున్నారు. గతేడాది అక్టోబర్ నెలలో ఆ గనిలో అక్రమంగా మైనింగ్ కార్యకలాపాలు సాగిస్తుండటంతో స్థానిక ప్రజాప్రతినిధి అనుచరులు ఒప్పుకోలేదు. అధికారుల ద్వారా ముమ్మరంగా తనిఖీలు చేయించారు.



శ్రీనివాస పద్మావతి (శోభారాణి) మైన్‌లో తవ్వకాలు

దీంతో అందులో విలువైన యంత్రాలను స్వాధీనం చేసుకుని 13 మందిపై కేసులు కూడా నమోదు చేయించారు. ఈ ఏడాది మార్చి నెలలో కూడా తవ్వకాలు సాగించడాన్ని ప్రజాప్రతినిధి అనుచరులే అడ్డుకున్నారు. దీంతో పనులు ఆగిపోయాయి.

చెలరేగిపోతూ..



రవాణాకు సిద్ధంగా ఉన్న ఖనిజం

నెల్లూరులోని కూటమికి చెందిన ఓ ముఖ్యనేత కన్ను మళ్లీ ఈ గనులపై పడింది. మంగళవారం నుంచి పనులు చేపట్టారు. అనుమతి లేకుండానే బ్లాస్టింగ్‌తో చెలరేగిపోతున్నారు. ఈ గనులపై గ్రీన్ ట్రిబ్యునల్లో కూడా కేసులు నడుస్తున్నాయి. ఇటీవల డివిజన్ స్థాయి అధికారి పర్యవేక్షణలో మైనింగ్, పర్యావరణ శాఖ, రెవెన్యూ అధికారులు సంయుక్తగా తనిఖీలు చేశారు. అయినా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అనుమతి లేని గనుల్లో మళ్లీ తవ్వకాలు సాగిస్తున్నా మైనింగ్, వివిధ శాఖల అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నట్లు సమాచారం.

మీ కోసం ప్రశ్నిస్తే.. మాపై కేసులా?

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మీ కోసం ప్రశ్నిస్తే.. మాపై కేసులు పెట్టడం దారుణమని సాక్షి పాత్రికేయులు పేర్కొన్నారు. డీఎస్పీల నుంచి ఏఎస్పీగా పదోన్నతుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీంతో తాము నష్టపోవాల్సి వస్తోందన్న పోలీసు అధికారుల ఆవేదనను 'సాక్షి' ప్రచురించింది. పోలీసులు మేలు కోరుతూ వార్త రాస్తే వారితోనే కూటమి ప్రభుత్వం 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై అక్రమ కేసు పెట్టించింది. దీనిని నిరసిస్తూ మంగళవారం సాయంత్రం జిల్లాలోని కలిగిరి, నెల్లూరు, తోటపల్లిగూడూరు, వరికుంటపాడు, ఆత్మకూరు, సంగం తదితర ప్రాంతాల్లో పోలీస్ అధికారులకు 'సాక్షి' పాత్రికేయులు వినతిపత్రాలు అందజేశారు.

మైపాడు రిసార్ట్స్‌కు కరెంట్ కట్

- అస్తవ్యస్తంగా నిర్వహణ
- అవస్థలు ఎదుర్కొంటున్న పర్యాటకులు



మైపాడు బీచ్ రిసార్ట్స్

ఇందుకూరుపేట: జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన మైపాడు బీచ్‌లో రిసార్ట్స్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందనే ఆరోపణలున్నాయి. రూ.2.30 లక్షల విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో సంబంధిత అధికారులు గత నెల 30వ తేదీ రాత్రి నుంచి సరఫరాను నిలిపివేశారు. బీచ్‌కు జిల్లా నలుమూలల నుంచే కాక పొరుగు రాష్ట్రాల నుంచి అనేకమంది సందర్శకులు వస్తుంటారు. సెలవు రోజుల్లో తాకిడి మరింత ఎక్కువగా ఉంటుంది. 2013లో తీరంలో రిసార్ట్స్ ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణను ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పింది. అయితే ఇక్కడ నగదు వసూలు చేయడం తప్ప పర్యాటకులకు కనీస వసతులు కల్పించడం లేదనే ఆరోపణలున్నాయి. గదుల్లో ఏసీలు, టీవీలు సక్రమంగా పనిచేయకపోవడం, పారిశుధ్యం లోపించడం తదితర సమస్యలున్నాయని పర్యాటకులు ఆవేదన చెందుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి విడిది చేసేందుకు మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో సర్దుకుపోవాల్సి వస్తోంది. రెస్టారెంట్ నిర్వహణ ఘోరంగా ఉన్నట్లు ప్రచారం ఉంది. అసాంఘిక కార్యకలాపాలకు రిసార్ట్స్ అడ్డాగా మారాయి. జంటలకు గదులను ఇచ్చేస్తున్నారు. అలాగే జూదరులు, మందుబాబులకు ఇది చిరునామాగా మారింది.

బిల్లు చెల్లిస్తేనే..

బిల్లును సకాలంలో చెల్లించపోవడంతో రిసార్ట్స్‌కు విద్యుత్ సరఫరా కట్ చేశాం. బిల్లు చెల్లిస్తే సరఫరాను పునరుద్ధరిస్తాం.

– నరసింహులు, విద్యుత్ శాఖ ఏఈ, నరసాపురం

డయాలసిస్ రోగుల ఇబ్బందులు

- విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పాట్లు
- జనరేటర్ లేక అవస్థలు



డయాలసిస్ చేయించుకునేందుకు వచ్చిన రోగులు

పొదలకూరు: డయాలసిస్ సెంటర్‌కు వచ్చిన రోగులు మంగళవారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. డయాలసిస్ జరుగుతున్న సమయంలో సుమారు మూడుగంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో రోగులతోపాటు వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. పొదలకూరు సీహెచ్‌సీలో 8 బెడ్స్ ఉండగా డయాలసిస్ చేయించుకునేందుకు చుట్టుపక్కల మండలాల నుంచి రోగులు వస్తుంటారు. ప్రక్రియ జరుగుతున్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే రోగుల రక్తం గడ్డకట్టే ప్రమాదం ఉందని టెక్నీషియన్లు వెల్లడిస్తున్నారు. పట్టణంలో ట్రాన్స్‌ఫార్మర్ సమస్య ఉందని విద్యుత్ అధికారులు గంటల సమయం సరఫరాను నిలిపివేశారు. సెంటర్ పర్యవేక్షణను రహీకేర్‌కు కేటాయించారు. జనరేటర్ లేకపోవడంతో తరచూ సమస్యలు వస్తున్నాయి. థర్డ్ పార్టీ సంస్థ జనరేటర్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందా? లేక కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుందా? అనేది స్పష్టత లేదు. దీంతో విద్యుత్ అంతరాయాల సమయంలో రోగులు నరకం అనుభవిస్తున్నారు.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం

- కాలువ వద్ద ఒరిగిపోయిన బస్సు
- బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడో?



ఘటనా స్థలంలో బస్సు

సోమశిల: రోడ్లను అభివృద్ధి చేశామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంటోంది. అయితే క్షేత్ర స్థాయిలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. దారుణంగా ఉన్న రహదారుల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన సోమశిల గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. మంగళవారం ఉదయం సోమశిల నుంచి నెల్లూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు ప్రమాదం తప్పింది. కొంతకాలం క్రితం ప్రాజెక్ట్ సమీపంలోని పరమానందయ్య ఆశ్రమం వద్ద బ్రిడ్జి కూలిపోయింది. ఇంతవరకు మరమ్మతులు చేపట్టలేదు. పక్కన డైవర్షన్ రోడ్డు ఏర్పాటుచేసి చేతులు దులుపుకొన్నారు. ఇక్కడ సరిపడినంత మార్జిన్ లేకపోవడంతో అటుగా వెళుతున్న బస్సు కాలువ వద్ద ఒరిగిపోయింది. ఆ సమయంలో 20 మందికి పైగా ప్రయాణికులుండగా డ్రైవర్ చాకచక్యంతో ప్రమాదం తప్పింది. ఇటీవల ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తూ కాలువలో పడగా తీవ్ర గాయాలయ్యాయి. అధికారులు త్వరతరగతిన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రౌడీషీటర్ తన్వీర్‌పై పీడీ యాక్ట్

నెల్లూరు(క్రైమ్): రౌడీషీటర్ షేక్ తన్వీర్‌పై పోలీస్ అధికారులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. కొంతకాలంగా జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడింది. అధికార పార్టీకి చెందిన కొందరు నేతల అండదండలతో పాతనేరస్తులు, రౌడీషీటర్లు పేట్రేగిపోయారు. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో యాక్టివ్‌గా ఉన్న వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. నెల్లూరు రూరల్ మండలం చంద్రబాబునగర్‌కు చెందిన షేక్ తన్వీర్‌పై వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. అతడిపై హత్యాయత్నం, దోపిడీ, దొంగతనం ఇలా 11 కేసులున్నాయి. ప్రస్తుతం వెంకటేశ్వరపురంలో నివాసం ఉంటున్నాడు. పలుమార్లు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించినా అతడి తీరులో మార్పురాలేదు. దీంతో మంగళవారం పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. జైల్లో ఉన్న తన్వీర్‌ను పోలీసు అధికారులు కడప కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ సందర్భంగా ఎస్పీ జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ పదేపదే నేరాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామన్నారు. అవసరమైతే జిల్లా బహిష్కరణకు వెనుకాడబోమన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

ప్రతి మదిలో రాజన్న జ్ఞాపకాలు

- ఆనం అరుణమ్మ, విజయకుమార్‌రెడ్డి



నివాళులర్పించిన ఆనం దంపతులు, నాయకులు

నెల్లూరు సిటీ: 'వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు పేదలకు చేయూతనందించారు. అందరి మదిలో ఆయన జ్ఞాపకాలు పదిలంగా ఉన్నాయి' అని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి అన్నారు. రూరల్లోని కరెంటాఫీస్ సెంటర్‌లో మహానేత రాజన్న విగ్రహానికి మంగళవారం వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజశేఖరరెడ్డి అన్ని వర్గాలకు ఆశాజ్యోతి అన్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య చికిత్స చేయించినట్లు చెప్పారు. ఆయన ప్రతి ఒక్కరి మనసులో శాశ్వతంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రూరల్ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో వైఎస్సార్ స్థానం పదిలం

- ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి ప్రజల గుండెల్లో పదిలమైన స్థానం ఉందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఉదయగిరిలో ట్యాంక్ బండ్ సర్కిల్లో మంగళవారం రాజన్న వర్ధంతిని పార్టీ మండలాధ్యక్షుడు కొండా రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మేకపాటి మాట్లాడుతూ వైఎస్సార్ సమాజంలో అన్ని వర్గాల అభిమానాన్ని సంపాదించారన్నారు. 108, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, జలయజ్ఞం తదితర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసి తన పాలన స్వర్ణయుగంగా మార్చారన్నారు. హామీలు నెరవేర్చే గుణం చంద్రబాబుకు లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఎంతో మేలు చేశారన్నారు. అబద్ధపు హామీలతో అధికారం చేపట్టిన చంద్రబాబు ప్రతిపక్షంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. తొలుత భారీగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు నేతలు వైఎస్సార్‌తో ఉన్న అనుబంధం, పాలన గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు గణపం బాలకృష్ణారెడ్డి, పి.మాల్యాద్రిరెడ్డి, మేదరమేట్ల శిలలీల, మోది రామాంజనేయులు, సీనియర్ నాయకులు చేజర్ల సుబ్బారెడ్డి, షేక్ అలీఅహ్మద్, అక్కి భాస్కర్‌రెడ్డి, కల్లూరు వెంకటేశ్వరరెడ్డి, డేగా వంశీ, పల్లాల కొండారెడ్డి, కె.రమణారెడ్డి, సలీం, దస్తగిరి అహ్మద్, కె.వెంకటరెడ్డి, కె.వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా మాధవి



నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి) రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ కొండేటి మాధవిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. రెగ్యులర్‌గా పనిచేసిన డాక్టర్ సిద్దానాయక్ జూన్ నెలాఖరులో ఉద్యోగ విరమణ చేశారు. దీంతో మెడికల్ కళాశాలలో బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ మాధవిని తాత్కాలికంగా ఇన్‌చార్జిగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నియమించింది. అప్పటి నుంచి ఆమె బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడు పదోన్నతి కల్పించి రెగ్యులర్ విధానంలో నియమించారు. నిజాయితీగా పని చేస్తారనే పేరున్నా ఇప్పటి వరకు ఆమె ఇన్‌చార్జిగా ఉండటంతో ఆస్పత్రి పరిపాలనలో తనదైన ముద్ర వేయలేకపోయారు. కొందరు డాక్టర్లు సమయపాలన పాటించకపోవడం, గంటో, రెండు గంటలో పని చేసి తప్పించుకుని తిరుగుతున్నా కఠిన నిర్ణయాలు తీసుకోలేకపోయారని ప్రచారం జరిగింది. స్కానింగ్, ఎక్స్‌రే, రక్తపరీక్షల వద్ద రద్దీగా ఉండటం, సకాలంలో పరీక్షలు చేయకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు రెగ్యులర్‌గా నియమించడంతో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

యువతి అదృశ్యం

నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని ధనలక్ష్మీపురం ప్రాంతానికి చెందిన ఓ యువతి గత నెల 25వ తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అరుణపై మరో కేసు నమోదు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆస్తి వివాదంలో ఓ వ్యక్తిని తుపాకీతో బెదిరించిన ఘటనలో అరుణ, ఆమె అనుచరులపై నెల్లూరు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన మంగళవారం రాత్రి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.. పోలీసుల కథనం మేరకు.. నవాబుపేట సెంటర్ సమీప ప్రాంతానికి చెందిన రవికుమార్, శశికుమార్ అనే అన్నదమ్ములకు ఆస్తి విషయమై విభేదాలున్నాయి. ఈక్రమంలో రవికుమార్‌కు మద్దతుగా అరుణ రంగంలోకి దిగింది. ఆస్తిని అతని పేరుపై రాయాలని అరుణ, ఆమె అనుచరులు ముస్తాక్, సుల్తాన్, సుమన్ మరో వ్యక్తి శశికుమార్‌ను తుపాకీతో బెదిరించారు. అప్పట్లో వారికి భయపడి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాలేదు. ఇటీవల అరుణ మోసాలపై బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న శశికుమార్ నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విచారణ ముమ్మరం

కోవూరు: పడుగుపాడు సాయి ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ ఆక్రమణ కేసులో అరుణ సహ నిందితులపై పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై రంగనాథ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నెల్లూరు జైలు నుంచి పల్లం వేణు, అంకెం రాజా, షేక్ అఫ్సర్‌ను కస్టడీలోకి తీసుకుని కోవూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ప్రశ్నించారు. యజమానిపై దౌర్జన్యం చేసిన ఘటనలో నిందితులను విడివిడిగా విచారించినట్లు సమాచారం. అయితే వారు పొంతనలేని సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. నిందితుల నుంచి పక్కాగా సమాచారం సేకరించడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

గేదెను ఢీకొట్టిన మోటార్‌బైక్

- వ్యక్తి మృతి



మస్తాన్‌బాబు మృతదేహం

ఉదయగిరి: మండలంలోని సర్వరాబాదు సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. మసాయిపేటకు చెందిన పిడుగు మస్తాన్‌బాబు (30) మోటార్‌బైక్‌పై సీతారామపురం మండలానికి వెళ్లాడు. పని ముగిశాక తిరిగి సొంతూరికి బయలుదేరాడు. ఈ క్రమంలో సర్వరాబాదు సమీపంలో బైక్ గేదెను ఢీకొట్టింది. మస్తాన్‌బాబు కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే గేదె కూడా చనిపోయింది. సమాచారం అందుకున్న ఎస్సై ఇంద్రసేనారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

పొదలకూరు: మండలంలోని అల్లూర్తి పొలాల్లో పేకాట స్థావరంపై మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై హనీఫ్ కథనం మేరకు.. పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఆరుగురిని అరెస్ట్ చేశారు. రూ.8 వేల నగదు, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



నారుమడులను పరిశీలిస్తున్న అధికారులు

కలిగిరి: పొగాకు నారుమడులు సాగు చేసే రైతులు బోర్డు అధికారుల సూచనల మేరకు ఆధునిక యాజమాన్య పద్ధతులు పాటించాలని కలిగిరి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలం కేంద్రం పరిధిలోని శెట్టిపాలెం, పార్లపల్లి, కొండాపురం, ఎస్.అగ్రహారం గ్రామాల్లో నారుమడుల సాగును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడుల సాగుకు బోర్డులో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. నారును రిజిస్టర్ చేసుకున్న రైతులకు మాత్రమే విక్రయించాలన్నారు. ఇతరులకు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. బోర్డు రిజిస్ట్రేషన్ లేకుండా నర్సరీలు, నారుమడులు సాగు చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఐటీసీ కంపెనీ మేనేజర్ జి.వెంకటేష్, పొగాకు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై పరిశీలన

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరు, రామస్వామిపల్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రాష్ట్ర స్థాయి టెక్నికల్ కో-ఆర్డినేటర్ రవిచంద్ర ప్రసాద్ మంగళవారం క్షేత్ర పరిశీలన చేశారు. మహిమలూరులో శ్రీనివాసులు అనే రైతు సాగు చేస్తున్న డ్రై పాడి మోడల్ పంటలు, మిరాకిల్ మోడల్ పంటలను పరిశీలించి అభినందించారు. విశ్రాంత ఉద్యోగి దశరథ రామిరెడ్డి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న మామిడితోటలను పరిశీలించారు.